క్లుప్తంగా

ఘనంగా గ్రామ దేవతల దేవర


మారెమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

సి.బెళగల్: మండల పరిధిలోని పల్‌దొడ్డి గ్రామంలో బుధవారం గ్రామ దేవతలు సుంకులమ్మ, మారెమ్మ అమ్మవార్ల దేవరను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. దేవరలో భాగంగా మంగళవారం రాత్రి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించి, బుధవారం తెల్లవారు జామున బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకోండి


అధికారులతో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ విజయ

కర్నూలు (న్యూటౌన్): ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ విజయ సూచించారు. బుధవారం ఆమె దిన్నెదేవరపాడు గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, సర్పంచ్ మాధవస్వామి ఉన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న గ్రీన్ అంబాసిడర్స్

కర్నూలు (న్యూటౌన్): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎదురూరు గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రీన్ అంబాసిడర్స్‌తో పరిసరాలను శుభ్రం చేయించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గురుస్వామి ఉన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు


సిబ్బందితో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ విజయ్‌కుమార్

కోడుమూరు రూరల్: విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని మండల స్పెషలాఫీసర్, సెరికల్చర్ ఏడీఏ విజయ్‌కుమార్ సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం 4, 5 సచివాలయాలను, అంగన్‌వాడీ సెంటర్‌లను తనిఖీ చేయడంతో పాటు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ మాట్లాడుతూ ప్రతిరోజు సాయంత్రం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. స్పెషలాఫీసర్ వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్ ఉన్నారు.

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి


ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రంలో వెలసిన మూల పెద్దమ్మ ఆలయాన్ని దాతల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు ఆర్ డి.చంద్రశేఖర రెడ్డి తెలిపారు. బుధవారం మూల పెద్దమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి చైర్మన్ తలారి చిన్నన్నతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలకు చెందిన డాక్టర్ ఎస్‌పీ శ్రీనివాసులు రూ.2.50 లక్షల ఆర్థిక సహకారంతో ప్రహరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం నాగేశ్వరరెడ్డి, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం వైపు ఆర్టీసీ అడుగులు

- గిరి ప్రదక్షిణ రోజు ప్రత్యేక బస్సులు
- ప్రత్యేక ప్యాకేజీ కింద నిర్వహణ
- మార్గమధ్యలో గోల్డెన్ టెంపుల్ ఉచిత దర్శనం
- ప్రయాణికుల నుంచి విశేష స్పందన
- ఒక బస్సుతో ప్రారంభం.. నేడు ఐదు బస్సులు ఫుల్



అరుణాచలం బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) అరుణాచలం వైపు అడుగులు వేస్తోంది. ఆదాయ మార్గాన్ని అన్వేషిస్తున్న సంస్థ తొలుత దూర ప్రాంత పుణ్య క్షేత్రాల వైపు దృష్టి పెట్టింది. అందులో భాగంగా తమిళనాడు రాష్ట్రంలోని ప్రముఖ ఆలయ క్షేత్రం అరుణాచలానికి బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టింది. ఈ మార్గాన నడుపుతున్న బస్సులకు ప్రయాణికుల నుంచి స్పందన లభించడంతో సేవలను విస్తరింపజేస్తోంది. ప్యాకేజీ కింద నడుపుతున్న ఈ ప్రత్యేక బస్సులో రానుపోను చార్జీలతో పాటు ఆలయ క్షేత్రాల దర్శనం కూడా ఉచితంగా చేయిస్తున్నారు. గత ఏడాది నవంబరు నుంచి ప్రారంభించి ప్రస్తుతం ఐదు బస్సులు సిద్ధం చేశారు.

గిరి ప్రదక్షిణ దీపోత్సవం రోజున బస్సులు

అరుణాచలం క్షేత్రంలో ప్రతి నెలా గిరి ప్రదక్షిణ దీపోత్సవం జరుగుతోంది. ఆ రోజు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని గ్రహించిన అధికారులు కర్నూలు నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు శ్రీకారం చుట్టారు. దీపోత్సవానికి ముందు రోజు బస్సు కర్నూలు నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయాన్నే కర్నూలుకు చేరుకుంటుంది. ఆ రోజు గిరి ప్రదక్షిణ, దీపోత్సవం, అరుణాచలేశ్వర స్వామి దర్శనం అనంతరం సాయంత్రం అక్కడి నుంచి బయలుదేని మరుసటి రోజు కర్నూలుకు అదే బస్సులో ప్రయాణికులను తీసుకొస్తారు. మరికొన్ని బస్సులు ఉదయాన్నే బయలుదేరి సాయంత్రానికి చేరుకుంటాయి.

ప్రత్యేక ప్యాకేజీ కింద బస్సులు

అరుణాచల క్షేత్రం దర్శనం ప్రత్యేక ప్యాకేజీ కింద బస్సులు నడపుతున్నారు. ముందుగా సూపర్ లగ్జరీ బస్సులు ప్రవేశపెట్టిన అధికారులు క్రమంగా ఇంద్ర ఏసీ సర్వీసులను పరిచయం చేశారు. కర్నూలు కొత్త బస్టాండ్ నుంచి బస్సులు బయలుదేరినప్పటి నుంచి తిరిగి కర్నూలుకు వచ్చే వరకు బస్సు ప్రయాణికులతోనే ఉంటుంది. వెళ్లేటప్పుడు, తిరుగు ప్రయాణంలో చిత్తూరు జిల్లా కాణిపాకం, వేలూరు స్వర్ణదేవాలయ అమ్మవారి దర్శనం కోసం అవకాశం కల్పిస్తారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో వెళ్లి వచ్చేందుకు చార్జీ రూ.2 వేలు కాగా ఇంద్ర ఏసీ బస్సుల్లో రూ.2,500 ఉంటుంది. ఇందులో ముందస్తు టిక్కెట్లు తీసుకునేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. బస్టాండ్లు, ఏజెంట్లు, ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందవచ్చు. గతంలో కర్నూలు–1, 2 డిపోల నుంచి మాత్రమే బస్సులు నడిపిన అధికారులు ఈ నెల 4న ఆదోని, ఎమ్మిగనూరు నుంచి కూడా ఒక్కో బస్సు చొప్పున నడపనున్నారు.

బస్సులు, ఆదాయ వివరాలు

నవంబరు 6న మూడు బస్సులు నడిపిన ఆర్టీసీకి రూ.1,78,710, 11న రూ.70,805, 13న రూ.37,400, 20న రూ.63,140, జనవరి 5న రూ.65,727, 7న రూ.70,250, ఫిబ్రవరి 4న రూ.71,280, మార్చి 5న రూ.71,280, ఏప్రిల్ 6న ఇంద్ర ఏసీ బస్సుకు రూ.92,541, సూపర్ లగ్జరీ బస్సులకు రూ.1,27,816 కలిపి మొత్తం రూ.8,48,949 ఆదాయం వచ్చింది. ప్రయాణికుల విన్నపం, గిరి ప్రదక్షిణ, దీపోత్సవాన్ని దృష్టిలో పెట్టుకొని ఈనెల 4న గురువారం ఉదయం 6, 7 గంటలకు, సాయంత్రం 5, 5:30 గంటలకు, 8 గంటలకు బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేశారు.

దైవ దర్శనానికి సమస్య ఉండదు


తమిళనాడులో ఉన్న అరుణాచలం దర్శనం కోసం వెళ్లేందుకు ఇబ్బందులు ఉంటాయి. కానీ ఆర్టీసీ నేరుగా ఇక్కటి నుంచి బస్సులు నడపడంతో సమస్య ఉండదు. ఇప్పటికే మేము వెళ్లి వచ్చాం. ప్యాకేజీ కింద కాణిపాకం, ఏలూరు స్వర్ణ దేవాలయం చూపించారు.

– పి.సుధారెడ్డి, కర్నూలు

టికెట్లు ఆన్‌లైన్‌లోనే పొందొచ్చు


అరుణాచలం వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక ప్యాకేజీ బస్సులు నడుపుతున్నాం. 4న మా డిపోతో పాటు కర్నూలు–1, ఎమ్మిగనూరు, ఆదోని డిపోల నుంచి మొత్తం ఐదు బస్సులు తిప్పేందుకు ఆన్‌లైన్‌లో ఉంచారు. ప్రయాణికులు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవచ్చు. లేదా సెల్ 99592 25794, 73828 71131, 77027 74358 నంబర్లు లేదా సమీపంలోని డిపో మేనేజర్లను సంప్రదించవచ్చు.

– సర్దార్ హుసేన్, కర్నూలు–2 డిపో మేనేజర్

రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లు

గూడూరు రూరల్: రైతు మిత్ర గ్రూపులకు సబ్సిడీపై స్ప్రేయర్లను అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీవర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల రైతులు గ్రూపులుగా తయారు చేసుకుని పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఒక్కో గ్రూపునకు నాలుగు చొప్పున మంజూరు చేస్తామని ఒక్కో స్ప్రేయర్‌కు రూ.8,000 వరకు సబ్సిడీపై అందిస్తున్నామని, ఇప్పటికే కొన్ని గ్రామాల్లో రైతు గ్రూపులకు అందించామన్నారు.

కేసీ కాల్వకు 130 క్యూసెక్కుల నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 130 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం ఈ నీటిని విడుదల చేశారు. ఇన్ ఫ్లో 370 క్యూసెక్కులు ఉందని, డ్యాంలో 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

సచివాలయం తనిఖీ

సి.బెళగల్: మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామ సచివాలయాన్ని నోడల్ అధికారి, సి.బెళగల్ పశువైద్యుడు ప్రవీణ్ తనిఖీ చేసి, రికార్డులు, ఉద్యోగుల హాజరు, లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయంలోని ఉద్యోగుల హాజరు, పనితీరుపై ప్రజల నుంచి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జగదీష్, వీఆర్వో లింగేష్ ఉన్నారు.

సేవల్లో అలసత్వం వద్దు

- జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కల్లూరు: సేవల్లో అలసత్వం వహించరాదని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం నాయకల్లు గ్రామ సచివాలయం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందితో సమావేశమై సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. చెత్త సంపద తయారీ కేంద్రం నుంచి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం, ఉపాధి హామీ పథకం కార్యాలయంలో రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలన్నారు. మనబడి నాడు–నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఈఓఆర్డీ రవికిషోర్ ఉన్నారు.


చెత్త నుంచి సంపద తయారు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

సచివాలయం తనిఖీ

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మండల ప్రత్యేక అధికారి సెట్కూరు సీఈఓ రమణ అన్నారు. బుధవారం ఆయన చిన్నటేకూరు, ఉలిందకొండ–1 సచివాలయాలు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

'గడప గడప'లో గుర్తించిన సమస్యలు పరిష్కరించండి

- ఎంపీడీఓలకు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సూచన

కర్నూలు (న్యూటౌన్): గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అధికారులకు సూచించారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే సుధాకర్ తన నివాసంలో ఎంపీడీఓలు చంద్రశేఖర్, ఎన్ భాస్కర్‌నాయుడు, మాధవీలత, రాముడులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు కర్నూలు మున్సిపాలిటీ పరిధిలో, 8, 9, 10, 11 తేదీల్లో పసుపల, 12, 13వ తేదీల్లో కోడుమూరు, 15, 16వ తేదీల్లో సి బెళగల్ మండలం ముడుములగుర్తి, 17, 18వ తేదీల్లో గూడూరు మండలం జూలకల్, 19, 20వ తేదీల్లో సి బెళగల్ మండలం కొండాపురం, 22, 23 తేదీల్లో కోడుమూరు, 24, 25 తేదీలో కర్నూలు మండలం నందనపల్లె, 26, 27, 29, 30 తేదీల్లో కోడుమూరు మండలం వర్కూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరై అక్కడ గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

- మత్స్యశాఖ డీడీ శ్యామల

సి.బెళగల్: జగనన్న కాలనీలల్లో జరుగుతున్న గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల అన్నారు. బుధవారం ఆమె కంబదహాల్ గ్రామంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులు, హౌసింగ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు, ఉద్యోగులు హాజరు, సంక్షేమ పథకాల అమలుతీరు, లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామ వలంటీర్ల సేవలు మెరుగుపడాలని, ప్రజల సమన్వయంతో విధులను నిర్వర్తించుకోవాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేమయ్యారు. ప్రతి మండల స్థాయి అధికారి సచివాలయాలను సందర్శించి గ్రామ స్థాయిలో అందుతున్న సేవలను పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్, ఎంఈఓ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, ఉపాధి హామీ ఏపీఓ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.


కంబదహాల్‌లో గృహ నిర్మాణాలపై అధికారులకు సూచనలిస్తున్న మత్స్యశాఖ డీడీ శ్యామల

అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్

కర్నూలు (న్యూటౌన్): 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై బుధవారం జెడ్పీలోని కర్నూలు మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు సోషల్ ఆడిట్ చేపట్టారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ టి.రవికుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వైఎస్సార్‌హెల్త్ క్లినిక్ నిర్మాణాలకు సంబంధించిన పనులపై 18 బృందాలు ఆడిట్ చేస్తున్నాయన్నారు. 10 రోజుల పాటు రికార్డులు పరిశీలించి, అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి పనుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు.


సోషల్ ఆడిట్ చేపట్టిన టీమ్ సభ్యులు

ప్రభుత్వ భవనాలు ముస్తాబు


చిన్నటేకూరులో పూర్తయిన ఆర్‌బీకే



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయం

కల్లూరు: గ్రామాల్లోనే అన్ని సేవలు అందించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా గ్రామ/వార్డు సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను నిర్మాణానికి అధికారులు నడుంబిగించారు. మండలంలో 19 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేయగా ఇప్పటికే 8 భవనాలు పూర్తయ్యాయి. 15 రైతు భరోసా కేంద్రాల్లో 7 పూర్తికాగా, 12 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో కె.మార్కాపురం భవనం పూర్తిగా మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. రూ. 25 లక్షలతో 11 సచివాలయాలు, రూ.35 లక్షలతో 3 సచివాలయాలు, రూ.40 లక్షలతో 5 సచివాలయాలు నిర్మించానున్నారు. రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలతో, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను రూ.17.50 లక్షలతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే లక్ష్మీపురం, ఉలిందకొండ, నాయకల్లు, కొంగనపాడు సచివాలయాలు భవనాలు పూర్తయ్యాయి. చిన్నటేకూరు, తడకనపల్లె, కె.మార్కాపురం, బస్తిపాడు సచివాలయ భవనాలు పూర్తయాయి. వాటిని త్వరలో ప్రారంభించనున్నారు.

గృహాలు త్వరగా నిర్మించుకోండి

గూడూరు రూరల్: జగనన్న కాలనీల్లో గృహాలు త్వరగా నిర్మించుకోవాలని ఎంపీడీఓ మాధవీలత లబ్ధిదారులకు సూచించారు. బుధవారం ఆమె కె.నాగలాపురంలోని జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుక, సిమెంట్, స్టీల్ తదితర సామగ్రి అందించడంతో పాటు సకాలంలో బిల్లులు మంజూరు చేస్తుందని చెప్పారు. విద్యుత్, నీటి సౌకర్యం కల్పించామని, వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట హౌసింగ్ ఏఈ జమ్మన్న, పంచాయతీ కార్యదర్శి సౌందర్య ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో గ్రామ నాభిలింగ, సుంకులాపరమేశ్వరీ దేవి విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనము, ఋత్విక్ వరుణయాగశాల ప్రవేశము, సర్వతోభద్రమండల ఆరాధనలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను సాయంత్రం గ్రామంలో ఊరేగించారు.

కరాటే సంఘం జిల్లా కార్యదర్శిగా షకీల్

కర్నూలు (టౌన్): జిల్లా కరాటే సంఘం నూతన కార్యదర్శిగా కేఎండీ షకీల్ ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం హాలులో ఏర్పాటు చేసిన కరాటే సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా షకీల్ మాట్లాడుతూ కరాటే క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం నూనత కార్యదర్శిని సన్మానించారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

గడివేముల: ప్రజలకు అందుబాటులు ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సూచించారు. బుధవారం గడివేముల తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు లేకుండా చూడాలని తహసీల్దార్ శ్రీనివాసులుకు సూచించారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆయా గ్రామాల సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. జగనన్న కాలనీలలో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందేలా చూడాలని డీఈ సుబ్బారెడ్డికి సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై దృష్టి సారించి తప్పకుండా పురోగతి సాధించాలన్నారు. అలాగే గడివేములలోని స్పెషల్ స్కూల్ రహదారిని త్వరగా ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ, తహసీల్దార్‌లను ఆదేశించారు. ఐసీడీఎస్‌లో గర్భిణులు, చిన్నారులకు అందించే పోషకాహారాలను తప్పకుండా నిర్ణీత గడువులోగా అందించాలన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

కర్నూలు (న్యూటౌన్): స్పందన కార్యక్రమంలో వచ్చే వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ సి హరిప్రసాద్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం జెడ్పీలోని సమావేశ భవనంలో కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, కల్లూరు మండల అధికారులు, కార్యాలయ ఉద్యోగులు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది రైతులు వివిధ సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, వారి సమస్యను పరిష్కరిస్తే ఎంతో సంతోషిస్తారని అన్నారు. స్పందనలో వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. సమావేశంలో ఆర్డీఓ ఆఫీస్ ఏఓ వేణుగోపాల్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ విజయశ్రీ, కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు, కల్లూరు తహసీల్దార్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. మొదటి రెండు రోజుల్లో గ్రామాల్లో ఉన్న పెన్షనర్లకు పింఛన్ పంపిణీ చేసిన వలంటీర్లు మూడోరోజు అందుబాటులో లేని, వివిధ ప్రాంతాల్లో చికిత్స కోసం వెళ్లిన వారిపై దృష్టి సారించారు. వారున్న చోటికే వెళ్లి పింఛన్ ఇచ్చి వచ్చారు.

- **కల్లూరు:** మండలంలో పెద్దటేకూరు గ్రామ సచివాలయానికి చెందిన పింఛన్ గౌండిపర్ల లక్ష్మీదేవి అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వలంటీర్ మహేశ్వరి అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశారు.
- **గడివేముల:** మండల పరిధిలోని పెసరవాయి గ్రామానికి చెందిన రాధాకృష్ణ కర్నూలులో చికిత్స పొందుతుండగా అక్కడికి వెళ్లి వలంటీర్ శ్రీనివాసులు పింఛన్ సొమ్ము అందజేశారు.
- **సి.బెళగల్:** మండల పరిధిలోని ముడుమాల గ్రామానికి చెందిన బారికి నారాయణ పక్షవాతానికి హైదరాబాద్ వైద్యం చేయించుకుంటున్నాడు. వలంటీర్ రాజ్‌కుమార్ అక్కడికి వెళ్లి పింఛన్ డబ్బు అందజేశారు. అదే గ్రామానికి చెందిన పెద్ద కృష్ణ అనారోగ్యంతో కర్నూలులో బంధువుల ఇంట్లో ఉంటూ చికిత్స పొందుతుండటంతో వలంటీర్ సోమప్ప అక్కడికి వెళ్లి పింఛన్ నగదు అందజేశారు.


పెసరవాయికి చెందిన రాధాకృష్ణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ శ్రీనివాసులు


సి.బెళగల్ మండలం ముడుమాల గ్రామానికి చెందిన పెద్ద కృష్ణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సోమప్ప

బోరు నీటితో పంటల సాగు

పాణ్యం: మండలంలో వ్యవసాయ బోర్ల కింద రైతులు పంటలు సాగు చేయడం ప్రాంభించారు. అధికంగా ఎస్సార్‌బీసీ ఆయకట్టు పొలాలు సాగవుతున్నాయి. దీంతో మూడు గ్రామాల మినహాయించి మిగిలిన గ్రామాల్లోని ప్రతి ఎకరాకు కృష్ణా జలాలు అందుతున్నాయి. అయితే ఎస్సార్‌బీసీ కాల్వలకు గతనెల చివరి వరకు నీరు సమృద్ధిగా అందింది. రెండవ పంటకు నీటిని బంద్ చేశారు. బోర్లు ఉన్న రైతులు పొలంలో విత్తనాలు నాటుతున్నారు. కొందరు రైతులు అరటి, పత్తి పంటలు సాగు చేశారు. వీటితో పాటు మరి కొందరు రైతులు ప్రకృతి వ్యవసాయ అధికారులు సూచించన విధంగా నవధాన్యాలను సాగు చేస్తున్నారు.


మొలకెత్తిన అరటి


ఇరుక్కుపోయిన ట్రాక్టర్‌ను ట్రాక్టర్లతో బయటకు లాగుతున్న రైతులు

కొర్రవాగు కష్టాలు

పాణ్యం: మండల పరిధిలోని అహల్యాపురం గ్రామ సమీపంలో ఉన్న కొర్రవాగుతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగు అవతల సుమారు 200 ఎకరాలకు పైగా గ్రామస్తులకు సాగు భూమి ఉంది. వాగులో వేసవిలో కూడా నీటి ప్రవాహం ఉంటుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రవాహం అధికంగా ఉంది. ప్రస్తుతం మిరప దిగుబడులను రైతులు ఇళ్లకు తెచ్చుకునే క్రమంలో ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు ఇరుక్కుపోతున్నాయి. రెండు రోజుల క్రితం కూలీలతో వెళ్లిన ట్రాక్టర్ నీటి ప్రవాహానికి కొట్టుకుపోతూ వాగులో ఇరుక్కుపోయింది. అప్రమత్తమైన డ్రైవర్ కూలీలను కిందకు దించడంతో ప్రాణాపాయం తప్పింది. ట్రాక్టర్‌ను మరో నాలుగు ట్రాక్టర్ల సాయంతో అతికష్టంపై బయటకు తీశారు.